# గమ్యం

- ఆదుర్తి బాల

"ఎవరిదీ వెడ్డింగ్ కార్డ్?" ఆఫీసునుంచి వస్తూనే టేబుల్ పైనున్న శుభలేఖని చూస్తూ అన్నాడు రామ్మూర్తి.

"వనజ పెళ్లట" భర్తకి మంచినీళ్ళు అందిస్తూ అన్నది భారతి.

"ఏ వనజ? శివరావు కూతురా?" ఆశ్చర్యపోయాడు రామ్మూర్తి.

"ఎంతమంది వనజలు తెలుసేమిటి మీకు ఏ వనజా అని అడుగుతున్నారు? శివరావుగారి అమ్మాయి వనజకే పెళ్లి."

"ఆ పిల్ల ఇంకా చిన్నదేగా. ఇంటర్ కూడా పూర్తి కాకుండానే పెళ్లికేం తొందరొచ్చిందిట?"

"ఆ చదువుతోందిలెండి... నాలుగేళ్ల నుంచి ఇంటర్‌తో కుస్తీ పడుతోంది. సినిమాల్లో టీనేజ్ ప్రేమలు చూసి జీవితాన్ని కూడా అలాగే ఊహించుకుంటోందేమోనని, ఆ పిల్ల ధోరణి పక్కదారి పడుతోందని గ్రహించిన తల్లిదండ్రులే ఆ పిల్లకి పెళ్లి చెయ్యాలని నిశ్చయించారు" వివరించింది భారతి.


"పిల్లలు పక్కదోవ పడితే తల్లిదండ్రులు సరిదిద్దాలి అంతేగానీ కనీసం డిగ్రీ అయినా పూర్తి కాకుండా పెళ్లేమిటి?"

"కందకి లేని దురద కత్తిపీటకెందుకని సామెత. వాళ్లకిలేని బాధ మీకెందుకు?" సాగదీసింది భారతి.

"కానీ ఆడపిల్లకైనా మగపిల్లాడైనా స్వావలంబన సాధించాక పెళ్లి చేసుకోవడమే సరైన పద్ధతి."

"సర్లెండి స్వావలంబన సంగతి దేవుడెరుగు. ఇంట్లో అయినా ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టదు. ఎంతసేపూ నీట్‌గా డ్రెస్ చేసుకుని ఫ్రెండ్స్‌తో కాలక్షేపం చేయడం, పత్రికల్లో బ్యూటీటిప్స్ చదివి ఫాలో అవడం, పెళ్లిచూపుల కోసమని బ్యూటీ క్లినిక్‌కి వెళ్లి ఫేషియల్ చేయించుకొచ్చిందిట. ఆ తల్లిదండ్రులైనా ఒక్కత్తే పిల్లకదాని గారం చేసారు బాగా. ఒక్కత్తే కూతురు కదా అని తాహతుకు మించిందైనా సరే పెద్ద సంబంధం కుదుర్చుకున్నారు. అబ్బాయి కంప్యూటర్ ఇంజనీరుట" పూర్తి డిటెయిల్స్ ఇచ్చింది భారతి.

"పెళ్లి చేసుకోవడానికి శరీరానికేకాదు, మనసుకి కూడా పరిపక్వత ఉండాలి. జీవితంలో స్థిరపడిన స్త్రీ ఆ జీవితాన్ని తనకిష్టమైన రీతిలో మలచుకోగలదు. అందుకు తగిన ఆత్మవిశ్వాసం కూడా కేవలం స్వావలంబన సాధించడం ద్వారానే ఏర్పడుతుంది. ఒకప్పుడు అమ్మాయిల పెళ్లి వయసు సమాజం నిర్దేశించినా ఇప్పుడా పరిస్థితి లేదుగా. తమకు నచ్చిన వాడిని తామే నిర్ణయించుకోగలుగుతున్నారు నేటి యువతులు. అంత ఖర్చు చేసి కట్నాలిచ్చి పెళ్లి చేసే బదులు ఆ పిల్లకి మంచి చదువు చెప్పించవచ్చు కదా" నిట్టూరుస్తూ అన్నాడు రామ్మూర్తి.



***

వనజ పెళ్లి అంగరంగ వైభవంగా జరిగిపోయింది. సహజంగానే అందంగా ఉండే వనజ పెళ్లి బట్టల్లో ఇంకా అందంగా మెరిసిపోతూ భర్త వెంట కాపురానికి వెళ్లిపోయింది.

చూస్తుండగానే ఆరునెలలు గడిచిపోయాయి.

***

"అమ్మా! వనజక్క వచ్చింది" అన్న కూతురు పిలుపుతో చేస్తున్న పని వదిలి హడావుడిగా వంటింటిలోంచి బైటకొచ్చింది భారతి.

"బాగున్నారా ఆంటీ" నవ్వుతూ పలకరించింది వనజ.

ఎందుకో ఆ నవ్వులో ఇదివరకటి అందం కనిపించలేదు భారతికి.

"మేం బాగానే వున్నాంకానీ నువ్వెలా వున్నావు? కొత్త కాపురం, కొత్త మనుషులు కదా అలవాటు పడ్డావా? ఇంకా లేదా?" ప్రశ్న మీద ప్రశ్న వేస్తూనే వనజ ముఖంలోకి పరీక్షగా చూసింది భారతి.

మనిషి కొంచెం చిక్కినట్టుంది. కళ్లకింద నల్లటి వలయాలు.

అన్నిటికీ మించి భారతిని ఆశ్చర్యపరచిన విషయం ఏమిటంటే ఎప్పుడూ శ్రద్ధగా తయారైగానీ బయటకు రాని వనజ తల కూడా సరిగ్గా దువ్వుకోలేదు. ఎక్కడో ఏదో తేడా వచ్చింది అనిపించింది భారతికి.

కాసేపు కూర్చుని కబుర్లుచెప్పి "ఇక వెళతానాంటీ" అని లేచింది వనజ.

"అప్పుడప్పుడు వస్తుండు వనజా. నువ్వూ నా కూతురులాటిదానివే" గేటు

వరకు వచ్చి వనజకు వీడ్కోలు ఇస్తూ అన్నది భారతి.

★★★

"పాపం శివరావుకి పెద్ద కష్టమే వచ్చింది" ఆ రోజు రాత్రి భోజనం చేస్తున్నప్పుడు అన్నాడు రామ్మూర్తి.

"కష్టమా? అంత పెద్ద కష్టం ఏమొచ్చిందండీ" భర్తకి కొంచెం కూర వడ్డిస్తూ అన్నది భారతి.


"కొత్తల్లుడు కొత్త కోరిక కోరాడు కదా మరి."

"ఏమడిగాడూ?"

"స్కూటర్ కావాలిట. కొత్త స్కూటర్ ఇస్తేగానీ మీ కూతురును ఏలుకోనని మామగారిని హెచ్చరించాడు."

"అంత పెద్ద ఉద్యోగస్థుడు కదా స్కూటర్ కొనుక్కోలేడూ? మామగారిని అడగడమెందుకు?" అన్న భారతి వంక చూస్తూ-

"వీళ్లంతా డబ్బుల్లేక, ఇల్లు గడవకా కట్నాలు తీసుకుంటున్నారా. తనది కాకపోతే కాశీదాకా డేకమన్నాడని... మోటు సామెత అయినా చాలా నిజముంది అందులో. అప్పనంగా వచ్చేది ఏదయినా ముద్దుగానే వుంటుంది. కానీ శివరావుని చూస్తుంటే జాలేస్తోంది. పాపం... పెళ్లికని చేసిన అప్పు ఇంకా తీరనేలేదు" అన్నాడు



## వింత ఆచారం

ఉత్తరాంచల్‌లోని ఓ ప్రదేశంలో ఓ గంట సేపు రాళ్లతో కొట్టుకుంటారట. ఓ పార్క్ వద్దకు చేరి ఫలానా రోజున రాళ్లతో కొట్టుకుంటే ఏమీ కాదని వారి అభిప్రాయమట. పైగా ఇది తెలిసిన పోలీసులు కూడా పట్టించుకోరట. ఇలా దేవుడి పేరుతో కొట్టుకుంటూంటే నష్టం జరగదని, పైగా మంచిదని వారి నమ్మకమట. గాయపడినవారిని ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి రెడీగా అంబులెన్స్, డాక్టర్స్ రెడీగా ఉంటారట కూడా. ఈ పోటీలో ఆడవాళ్ళు కూడా ఉత్సాహంగా పాల్గొనడం విశేషం.

## అతి పొడవైన సొరంగం

1277 నాటి సొరంగం ఇటీవలే బయటపడిందిట. స్పానిష్ చక్రవర్తి చరిత్రను చాటి చెబుతున్న ఈ సొరంగం ఇటీవల ప్రజల దృష్టికి వచ్చి అందరూ చూడ్డానికి వీలుగా డెవలప్ చేసి టిక్కెట్ పెట్టారు. ఎనిమిది వందల మీటర్ల పొడవున్న ఈ సొరంగాన్ని చూడ్డానికి లక్షల్లో జనం వస్తున్నారట. పైగా ఆదాయం కూడా బాగానే వుంది. ఇంకేం టూరిస్టులను ఆకర్షించే ఈ సొరంగం పునరుద్ధరణకున్న ప్రాధాన్యం అర్థమవుతోందికదా. ప్రపంచంలోనే ఇది అత్యంత పొడవైన సొరంగం.

## కోరియున్న నమ్మకం

వివాహం రోజున వధూవరులు హుషారుగా, చలాకీగా నవ్వుతూ ఉంటే వారికి తొలిగా ఆడపిల్ల పుడుతుందని కొరియన్ల నమ్మకం. మగపిల్లవాడు కావాలనుకునే దంపతులు పెళ్లినాడు డల్‌గా ఉండాలేమో మరి.

-మౌన

రామ్మూర్తి.

"ఏం చేస్తాం వాళ్ళ ఖర్మ అలాంటి అల్లుడు దొరికాడు."

"ఇక్కడ ఖర్మ సిద్ధాంతం కాదు అనుకోవాల్సింది. ఇది నిర్ణయ సిద్ధాంతం. మన నిర్ణయాలు బాగున్నప్పుడు మంచి ఫలితాలు అనుభవిస్తాం. మన నిర్ణయం సరైంది కానప్పుడు దానివల్ల వచ్చే చెడు ఫలితాలూ అనుభవించక తప్పదు" తనలో తాను అనుకున్నట్లుగా అన్నాడు రామ్మూర్తి.

కొత్త అల్లుడి కొత్త కోరిక తీర్చడంకోసం కొత్త అప్పు చేయాల్సి వచ్చింది శివరావుకి. వనజ కొత్త స్కూటర్ కానుకగా సమర్పించుకుని కాపురానికి వెళ్లిపోయింది.

***

"శివరావు అల్లుడికి అమెరికా ఛాన్స్ వచ్చిందిట" ఇంటికొస్తూనే అన్నాడు రామ్మూర్తి.

"నిజంగానా! పోన్లెండి వనజ అదృష్టం" మనస్ఫూర్తిగా అన్నది భారతి.

"అన్నట్లు వనజ వచ్చిందిట. సాయంత్రం ఒకసారి పలకరించి వద్దాం వాళ్లని" అన్నాడు రామ్మూర్తి. ఆ రోజు సాయంత్రం రామ్మూర్తి, భారతి శివరావు దంపతులని పలకరించడానికి వాళ్లింటికెళ్లారు.

"ఏమ్మా వనజా! అమెరికా వాస్తవ్యురాలివి అవుతున్నావుగా. మాకు పార్టీ ఇవ్వవా మరి" వనజను ఉద్దేశించి అన్నాడు రామ్మూర్తి.

"తప్పకుండా ఇస్తానంకుల్. మాకు మీరు తప్ప ఆపులు ఎవరున్నారు? కానీ నేనింకా ఇప్పుడే వెళ్లను. ముందర ఆయన వెళ్లి అక్కడ ఉద్యోగంలో కుదురుకున్నాక నన్ను తీసుకువెళతానన్నారు."

"మీ ఆయనకి మంచి జాబ్ వచ్చిందంటున్నావుగా. ఇంకా ఉద్యోగంలో కుదురుకోవడం ఏమిటి?" అర్థం కానట్టు అన్నాడు రామ్మూర్తి.

"ఏమో అంకుల్. మంచి అకామిడేషన్ దొరికాక తనే ఇండియా వచ్చి తీసుకువెళతానన్నారు" బదులిచ్చింది వనజ.

"నువ్వు అతడికి వచ్చిన ఉద్యోగమేమిటో కనుక్కున్నావా? కనీసం ఆఫీస్ అడ్రస్ అయినా నోట్ చేసుకుని వుంచు" అన్న రామ్మూర్తి మాటలని మరోలా అర్థం చేసుకుంది వనజ.

"అయినా ఓ మూడు నెలలలో అంతా సెటిల్ చేస్తానన్నారు ఆయన. మూడునెలలు ఎంతలో గడిచిపోతాయి అంకుల్."

"నీకన్నా ఎక్కువగా ప్రపంచాన్ని చూశానమ్మా నేను. నా మాటలకి బాధపడకు. ఉన్నమాట చెప్తున్నా. మీ ఆయన నిన్ను చేసుకున్నది మీ వాళ్లిచ్చే కట్నం చూసి. సరే ఈ రోజుల్లో కట్నాలు లేకుండా పెళ్లిళ్ళు ఎక్కడ జరుగుతున్నాయని నీవ దగవచ్చు. నిజమే కట్నం డబ్బు ఇచ్చాకైనా ఎప్పుడూ కానుకల కోసం ఏదోక డిమాండ్ చేస్తూనే వున్నాడు మీ ఆయన. నువ్వే ఆలోచించు మీ వివాహబంధాన్ని నిలుపుకోవడానికి నువ్వు ఎన్ని కానుకలు సమర్పించుకున్నావో. ఇప్పుడేమో అతడు అమెరికా వెళ్లిపోతున్నాడు తన ఉద్యోగమెక్కడో ఏ డిటెయిల్స్ నీకివ్వకుండా. దీన్నిబట్టి నీకేమర్థం అవుతోంది?" వనజలో కలిగే భావాలని గమనిస్తూ అన్నాడు రామ్మూర్తి.

"ఆయనని అనుమానిస్తున్నారా అంకుల్. ఆయన నన్ను వదిలి పెట్టరు. నేను అగ్నిసాక్షిగా పెళ్లాడిన అతని భార్యని" బాధ నిండిన స్వరంతో అన్నది వనజ.

"భార్యాభర్తల మధ్య ఉండాల్సింది నమ్మకం. కానీ డబ్బు వ్యామోహం నమ్మకాన్ని మింగేసినప్పుడు కట్టుకున్న భర్తనైనా అనుమానించాల్సి వస్తుంది. ఈమధ్య పేపర్లో వార్తలు చదవలేదూ భార్యని ఇండియాలో వదిలేసి అమెరికాలో సెటిలయి అక్కడే ఇంకొక పెళ్లి చేసుకున్నవాళ్లని. వాళ్లందరూ ఇక్కడ అగ్నిసాక్షిగానే పెళ్లి చేసుకున్నారు. మనస్సాక్షే లేనివారికి అగ్నిసాక్షి అంటే నమ్మకం వుంటుందా?"

"నన్నేం చేయమంటారు అంకుల్?"


"కనీసం అతని ఉద్యోగ వివరాలూ, అడ్రస్ నోట్ చేసుకో."

తలూపింది వనజ.

కాసేపు కూర్చుని కబుర్లు చెప్పాక దిగులుగా కనిపించిన వనజతో "మరీ అంత దిగులు పడకు. నీ భర్తతో నువ్వు సుఖంగా అమెరికా జీవితం గడుపుతావు. నేనిందాక చెప్పింది నాణానికి ఒక పార్శ్వమే" అనునయంగా అన్నాడు రామ్మూర్తి.

***

అందరు అనుకున్నట్లుగానే వనజ భర్త అమెరికా వెళ్లిపోయాడు. వెళ్లిన వారానికి ఫోన్ చేసాడు. అది అతని తల్లిదండ్రులని పలకరించడానికే. ఎప్పుడైనా ఈమెయిల్స్ ఇచ్చేవాడు. అందులో వనజ ప్రస్తావన ఉండేదికాదు. ఎప్పుడైనా వనజ ఫోన్ చేసినా 'హలో బాగున్నావా' వరకే పరిమితమయ్యేది అతని పలకరింపు. తనని ఎప్పుడు తీసుకెళతావని వనజ అడిగే ప్రశ్నకి సరిగా సమాధానం చెప్పేవాడు కాదు. భవిష్యత్తు అగమ్యగోచరంగా మారి ముందు జరగబోయే సంఘటనలకి నాందిగా ఒకరోజు వనజతో అన్నది అత్తగారు-



"మావాడు ఇండియా వచ్చే ప్రసక్తి లేదు. నీలాంటి చదువులేని పిల్ల భార్య అయితే ఇండియాలో ఎలాగో సర్దుకుపోవచ్చు. కానీ మావాడు ఉండేది అమెరికాలో కదా. అక్కడ అందరితో కలుపుగోలుగా తిరగాలన్నా, ఒక్కర్తీ బయటికెళ్లి షాపింగ్ చేసుకురావాలన్నా బాగా ఇంగ్లీషు మాట్లాడగలిగి ఉండాలి. అదీగాక అక్కడ ఆడవాళ్లెవ్వరూ ఖాళీగా కూర్చోరు. పోనీ ఏదైనా ఉద్యోగం చేయాలన్నా నీకు డిగ్రీ కూడా లేదాయె."

వనజకు రామ్మూర్తి అంకుల్ గుర్తొచ్చాడు. ఈ ప్రపంచంలో రెండు వ్యతిరేకాలు ఎప్పుడూ జంటగా వుంటాయి. మంచి చెడూ, మంచి మనుషులు, చెడ్డ మనుషులు. చెడుని చెరిపి వేయడానికి మంచి పుడుతుంది. మంచిని గెలవాలని చెడు చూస్తుంది. నాణానికి అంకుల్ చూసిన చెడు పార్శ్వమే గెలిచింది. ఇప్పుడు అంకుల్ ఊహించినట్టు తన భర్త ఇక ఇండియా రాడు. అమెరికాలో అతడు ఉండేదెక్కడో తనకి తెలీదు. భర్తని అమెరికా వెళ్ళే ముందు తను ఆ సంగతి అడగలేదు. అతడి అడ్రస్ అయినా తెలుసుకో అన్న అంకుల్ సలహా తను పాటించలేదు. కారణం? భర్త మీద ఏ మూలో మిగిలివున్న నమ్మకం. ఇప్పుడు తను చేసేదేం లేదు. తల్లిదండ్రుల నాశ్రయించే ప్రసక్తేలేదు. సొంతంగా నిలబడే అర్హత తను సంపాదించుకోలేదు. మిగిలింది ఒక్కటే దారి?

***

మధ్యాహ్నం భోజనంచేసి నిద్రకు ఉపక్రమించబోతుండగా ఫోన్ రింగవుతుంటే ఈ వేళప్పుడు ఫోన్ ఎవరు చేస్తారనుకుంటూ ఫోన్ తీసింది భారతి. అవతలి నుండి రామ్మూర్తి మాట్లాడాడు. వనజ నిద్రమాత్రలు మింగేసిందని, హాస్పిటల్‌లో చేర్చారని, తను ఆఫీస్ నుంచి అటు వస్తున్నానని, భారతిని కూడా హాస్పిటల్‌కి రమ్మని చెప్పాడు.

అదిరిపడింది భారతి. నిద్ర బద్దకం వదిలిపోయింది. ఐదు నిముషాల్లో ఇంటికి తాళంవేసి బయలుదేరింది. హాస్పిటల్ వెయిటింగ్ హాల్లో ఎదురయ్యారు శివరావు దంపతులు. రాత్రి నిద్రలేక కొంత, టెన్షన్ వలన కొంత ఇద్దరి ముఖాలూ పీక్కుపోయి ఉన్నాయి.

"ఏ క్షణాన కూతురి పెళ్లి చేసామోగానీ ఆ క్షణం నుంచి ఒక్కరోజు కూడా సంతోషంగా గడపలేదు మేము. దశమ గ్రహంలా అడుగుపెట్టాడు అల్లుడు" భోరుమంది వనజ తల్లి.

"బాధపడకండి. ఇంతకీ ఏమైంది?" ఆతృతగా అడిగింది భారతి.

"ఏం చెప్పమంటావమ్మా. మా అల్లుడు అమెరికాలోనే ఎవరో పిల్లని పెళ్లి చేసుకుని సెటిలైపోయాడుట. తన భర్త వచ్చి తనని తీసుకెళతాడని ఎదురు చూస్తున్న నా చిట్టితల్లి ఈ ఘోరం తట్టుకోలేకపోయింది" వనజ తల్లిని ఓదార్చడం ఎవరి తరం కావట్లేదు.

రామ్మూర్తికి ఆశ్చర్యమనిపించలేదు ఈ సంగతి విన్నాక. కానీ వనజ ఆత్మహత్యా యత్నమే అతడికి బాధ కలిగించింది. వనజకి అప్పుడే స్పృహ వచ్చిందని చెప్పింది నర్సు. కళ్ళు తెరుస్తూనే "నేనెందుకు బ్రతకాలి అంకుల్" కళ్లనీళ్లతో అన్నది వనజ.

"ఇలాంటి ప్రశ్నే పాజిటివ్‌గా వేసుకో. నేనెందుకు చావాలి అని ప్రశ్నించుకో. అప్పుడు నీ జీవితంలో ప్రశ్నార్థకాలే ఉండవు. నీకు నిషాశర్మ పేరు గుర్తుందా? కట్నకానుకల కోసం పెళ్లికి ముందు నుంచే డిమాండ్ చేస్తున్న తనకు కాబోయే భర్తని, అతని తల్లిదండ్రులనీ ధైర్యంగా చట్టానికి అప్పగించింది. ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. నీ జీవితం ఆ జీవితాన్ని నీవు ఎదుర్కొన్న వైనం ఇంకొకరికి స్ఫూర్తినివ్వాలిగానీ క్రుంగదీయకూడదు. ఈ జీవితం నీకు విసిరిన సవాల్‌ని ధైర్యంగా ఎదుర్కో."

"కానీ...కానీ... నాకేం అర్హత వుంది బ్రతకడానికి? కనీసం నన్ను నేను కూడా పోషించుకోలేను."

"అందుకని చావాలనుకుంటున్నావా? నీ ప్రాణం నీ ఇష్టం. కానీ నిన్నే ప్రాణంగా చూసుకునే నీ తల్లిదండ్రులని బాధపెట్టే హక్కు నీకు లేదు. నీకు చదువులేదుకదా అని అనుకోకు. నువ్వు చదువు మీద దృష్టి పెట్టలేదు కాబట్టి చదువుకోలేదు అనుకో. ఆ ప్రయత్నం ఇకనైనా మొదలుపెట్టు. ఇటీజ్ టూ లేట్ అనుకోకు. లేట్‌గా మొదలుపెట్టి జీవితంలో విజయం సాధించిన వారెందరో ఉన్నారు. పిరికిదానిలా నీ ప్రాణం తీసుకోవడంవలన నీ భర్తలాంటి మోసగాళ్లకి వచ్చే నష్టమేంలేదు. నువ్వు చేయాల్సిందల్లా తను చేసిన మోసానికి నీ భర్త సిగ్గుతో తల వంచుకునేలా చేయడం."


"అందుకు నేనేం చేయాలి?"

"చట్టాలున్నాయి, పోలీసులున్నారు. నీకు మోరల్ సపోర్ట్ ఇవ్వడానికి మేమున్నాము" అన్నాడు రామ్మూర్తి.

"నువ్వు చెప్పింది ఆచరిస్తాను అంకుల్. నా భర్తలాంటి మోసగాడికి గుణపాఠం నేర్పుతాను. ఇంతకింతా అనుభవించేలా చేస్తాను" ఆత్మవిశ్వాసం కళ్లల్లో ప్రతిఫలిస్తుండగా అంది వనజ.

ఆ కళ్ళే చెబుతున్నాయి ఇప్పుడు ఆమె గమ్యమేమిటో!

★



## అవకాశాల వెల్లువ

బాలీవుడ్ సినిమాల్లో బిజీగా ఉన్న లారాదత్తాని అంతా హృదయరాణి అంటున్నారు. పబ్లిక్ రిలేషన్స్ ఏజెన్సీకి మోడల్‌గా కొత్త కెరీర్‌ని ప్రారంభించిన లారదత్తా అటు పారిస్, ఇటు న్యూయార్క్ తెగ తిరుగుతోంది. ఈ సంగతే అడిగితే ఆమె మిలియన్ డాలర్ల నవ్వుతో అలరిస్తోంది. అన్నట్టు లారాదత్తా ఇప్పుడు అన్ని టాపిక్స్ గురించి తెగ మాట్లాడుతోంది. ఎప్పటికప్పుడు తన అందాన్ని మెరుగులు దిద్దుకుంటూ మరిన్ని అవకాశాల్ని చేజిక్కుంచుకుంటోంది. ఇదిలా ఉంటే 'ఖాకీ' చిత్రంలో ఆమె చేసిన ఐటెం నెంబర్ సాంగ్‌కి మంచి పేరొచ్చింది.

